నిరుపేదలకు తోడుగా.. అభాగ్యులకు అండగా...

- చేయూతనందిస్తున్న సర్వహిత చారిటబుల్ ట్రస్ట్
- జన హితం.. 'సర్వహిత' అభిమతం
- 16 ఏళ్లుగా సేవా కార్యక్రమాలు



నిర్వాసిత కాలనీలో బాధితునికి నగదు, రేషన్ సరకులు అందిస్తున్న ట్రస్ట్ నిర్వాహకులు



అధ్యాపకులకు సత్కారం..విద్యార్థులకు నగదు పురస్కారాల అందజేత..



నిరుపేద కుటుంబాలకు నిత్యావసరాలు అందిస్తూ..

అయిన వారు ఉండి పేగు బంధాన్ని అనాథలుగా మారుస్తున్న నేటి సమాజంలో... కొందరు దయామూర్తులు అలాంటి వారికి అండగా నిలుస్తున్నారు.కుటుంబ పెద్దను కోల్పోయి నిరాశ్రయులైన కుటుంబాలకు భరోసా ఇస్తున్నారు. కిడ్నీ, క్యాన్సర్ బాధితులతో పాటు వివిధ ప్రమాదాల్లో క్షతగాత్రులైన వందలాది కుటుంబాలకు చేయూతనందిస్తున్నారు. సేవలకు హద్దులు, సరిహద్దులతో పనిలేదని నిరూపిస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోంది సర్వహిత చారిటబుల్ ట్రస్ట్.

– అగనంపూడి

జీవీఎంసీ 85వ వార్డు పెదమడకకు చెందిన గుదే సుశీలా గజేంద్రరావు (వ్యవస్థాపకుడు), కొండయ్యవలసకు చెందిన పట్టా రామ అప్పారావు (సలహాదారు) సారథ్యంలో సర్వహిత చారిటబుల్ ట్రస్ట్‌ను 16 ఏళ్ల కిందట ఏర్పాటు చేశారు. పేరు ఎంపికలో శ్రద్ధ తీసుకోవడంతోపాటు సేవలు అందించడంలో అదే తీరు కనబర్చుతూ ఎంతోమందికి భరోసాగా నిలుస్తున్నారు. ట్రస్ట్ కార్యకలాపాల్లో సేవా భావం కలవారిని భాగస్వాములను చేసుకుంటూ సేవా నిరతిని కొనసాగిస్తున్నారు.

తలుపుతట్టి సాయం

ప్రభుత్వ పింఛన్‌కు అర్హత ఉండి సాంకేతిక, ఇతర కారణాల వల్ల పింఛన్ దక్కని వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు చేదోడువాదోడుగా నిలుస్తున్నారు. వారికి ట్రస్ట్ తరఫున దాతల సాయంతో పింఛన్లు అందిస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులతో ఉన్నవార్ని గుర్తించి వారి తలుపు తట్టి సహాయం అందిస్తున్నారు. వయోవృద్ధులు, ఒంటరి మహిళలు, వితంతువులు, వికలాంగులకు నెలనెలా పింఛన్‌తోపాటు సంక్రాంతి, ఉగాది, దీపావళి, దసరా వంటి పండగ సందర్భాల్లో కొత్త బట్టలతో సత్కరించడం, వీరిని ఏడాదికోసారి తీర్థయాత్రలకు తీసుకువెళ్లడం వంటి కార్యక్రమాలు చేపడుతున్నారు.



నిరుపేద మహిళలకు పెళ్లి పుస్తులు, ఖర్చుల కోసం డబ్బులు అందిస్తున్న ట్రస్ట్ నిర్వాహకులు

పింఛన్ల పంపిణీతో ట్రస్ట్ సేవలు ఆరంభం

ఇద్దరికి పింఛన్ అందివ్వడంతో ప్రారంభమైన ట్రస్టు కార్యకలాపాలు విస్తృతమయ్యాయి. నేడు 75 మందికి పింఛన్లు అందిస్తోంది. పింఛన్‌దారులు మృతి చెందితే వారి దహన సంస్కారాల ఖర్చులు ట్రస్ట్ చేస్తుంది.

క్షతగాత్రులకు బాసటగా..

వివిధ ప్రమాదాల్లో క్షతగాత్రులై దీర్ఘకాలం పాటు మంచానికే పరిమితమైన బాధితులు కోలుకొనే వరకు నిత్యావసర సరకులతో పాటు ఆర్థిక సాయం అందిస్తున్నారు. పేద విద్యార్థుల చదువులకు అవసరమైన ఆర్థిక తోడ్పాటు అందిస్తూ సేవే లక్ష్యంగా పయణిస్తున్నారు. నిరుపేద మహిళల వివాహానికి ఖర్చులు చెల్లించడం, శుభ కార్యాల్లో విందులు, ఆర్భాటాలు, విలాసాలకు స్వస్తి పలికి ట్రస్ట్ ద్వారా నిరుపేదలకు ఒకపూట రుచికరమైన భోజనం పెట్టిస్తున్నారు. మానవతావాదులను ట్రస్ట్ కార్యకలాపాల్లో పాలు పంచుకొనేలా సభ్యులు నిరంతరం కృషి చేస్తున్నారు.

ప్రాంతాలకు అతీతంగా...



సేవ చేయాలనే తలంపు మనిషి మనసులోనుంచి రావాలి. అప్పుడే సేవలకు నిజమైన అర్థం, పరమార్థం ఉంటుంది. ఆర్తులను ఆదుకోవాలనే మనసు ఉన్నప్పుడు కులం, మతం, ప్రాంతం చూడకూడదు. సేవా చేయాలనే ఆలోచన ఉన్నా కొంతమంది వెనుకంజవేస్తుంటారు. అటువంటి వారిలో సేవా భావాన్ని కల్పించడంలో సఫలం అయ్యాం.

– పట్టా రామ అప్పారావు, సలహాదారు

వితరణలోనే సంతృప్తి



సమాజం ద్వారా ఉన్నత స్థితికి చేరాం. తిరిగి సమాజంలో అట్టడుగు వర్గాలకు చేతనైనంత సహాయం చేయడం కనీస ధర్మమని భావిస్తున్నాను. మా ట్రస్ట్ కార్యకలాపాలు చూసి ఏ కొద్ది మందికైనా స్ఫూర్తి కలుగుతుందని ట్రస్ట్ ప్రారంభించాం. అనుకున్నట్టే ట్రస్ట్ చేస్తున్న కార్యక్రమాలు, సేవా నిరతిని చూసి మహోన్నత వ్యక్తిత్వం ఉన్న వారు తోడ్పాటు అందిస్తున్నారు. వారి సాయంతో పేదలకు ఆర్థిక, నిత్యావసర సరకులు అందిస్తున్నాం.

– గుదే సుశీలా గజేంద్రరావు, సర్వహిత ట్రస్ట్ వ్యవస్థాపకుడు

ట్రస్ట్ అండగా నిలుస్తుంది



ప్రభుత్వ పింఛన్ రూ.75 ఉన్నప్పుడే ట్రస్ట్ మాకు రూ.200 వంతున అందించి ఉదారత చాటుకుంది. నిరుపేద అంటే ట్రస్ట్ ప్రతినిధుల చేతికి ఎముక ఉండదు. జాలి, దయ గుణం ట్రస్ట్ నిర్వాహకుల్లో ఉండడం వల్లే మమ్మల్ని కుటుంబ సభ్యులుగా పరిగణిస్తున్నారు.

– డి.అప్పలనర్సమ్మ, ట్రస్ట్ సహాయం పొందుతున్న వృద్ధురాలు

ఆ సంతృప్తి వేరు



ఆకలి వేసే వారికి అన్నం విలువ తెలుస్తుంది. అటువంటి వారికి సేవ చేయడం మహా భాగ్యంగా భావిస్తున్నాం. సేవా కార్యక్రమంలో పాల్గొనే అవకాశం దక్కడం మహదానందంగా ఉంటుంది. మానవ సేవే మాధవ సేవ అని నా భావన. అందుకే ట్రస్ట్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించగలుగుతున్నాను.

– మస్తాన్‌రెడ్డి, చైర్మన్

మా కళ్లలో సంతోషం కోసం



మాలాంటి వారి కళ్లల్లో ఆనందం కోసం ట్రస్ట్ పరితపిస్తుంది. ట్రస్ట్ భాగస్వాములందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు. కన్నవారిలా అక్కున చేర్చుకోవడం, తీర్థయాత్రలకు తీసుకువెళ్లడం, పండగల్లో విందు భోజనాలు ఏర్పాటు చేస్తున్నారు. సీజన్‌కు తగిన విధంగా దుప్పట్లు, గొడుగులు, చెప్పులు అందివ్వడం ఎవరు చేస్తారు ఈ రోజుల్లో.

– కరణం అప్పారావు, అగనంపూడి కాలనీ

క్లుప్తంగా

దుర్గమాంబ జాతర నేడు



జాతర పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ, గ్రామపెద్దలు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి నిర్వాసితకాలనీ దొంకాడ గ్రామ దేవత దుర్గమాంబ అమ్మవారి జాతరను గురువారం ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ సన్నాహాలు చేసింది. ఈ మేరకు ఆలయం వద్ద బుధవారం అమ్మవారి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ గురువారం తెల్లవారు జాము నుంచి భక్తుల దర్శనం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. అనుపు సందర్భంగా సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు వారు పేర్కొన్నారు.

30 చలివేంద్రాల ఏర్పాటు



66వ వార్డులో ఏర్పాటు చేసిన చలివేంద్రం

గాజువాక: జీవీఎంసీ అధికారులు గాజువాక జోన్‌లో 30 చలివేంద్రాలను ప్రారంభించారు. వీటితో పాటు 16 గ్రీన్ షెల్టర్లను ఏర్పాటు చేశారు. ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్న నేపథ్యంలో వేడి నుంచి ప్రజలు ఉపశమనం పొందేందుకు ఈ చర్యలు చేపట్టినట్టు జోనల్ కమిషనర్ శేషాద్రి తెలిపారు. ప్రతిరోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు తాగునీటిని చలివేంద్రాల్లో అందుబాటులో ఉంచుతామన్నారు. రాకపోకలు సాగించే ప్రయాణికులు, పాదచారుల కోసం కొన్ని కీలక జంక్షన్లలో గ్రీన్‌షెల్టర్లను ఏర్పాటు చేశామన్నారు.

'సెల్ టవర్‌కు అనుమతి ఇవ్వొద్దు'

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు అగనంపూడి శాంతినగర్‌లో జియో సంస్థ సెల్ టవర్ ఏర్పాటు చేయడానికి జీవీఎంసీ నుంచి అనుమతి ఇవ్వొద్దని ఏసీపీ వెంకటరావుకు బుధవారం స్థానికులు వినతిపత్రం అందించారు. ప్రజల ఆరోగ్యానికి హానికలిగించే ఇలాంటి టవర్లను జనావాసాలకు దూరంగా వేయాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో బి.సత్యనారాయణ, నాగమణి, రుద్ర కుమార్ తదితరులు ఉన్నారు.

స్టీల్‌ప్లాంట్ సీఎండీని కలిసిన సీఐఎస్ఎఫ్ డీఐజీ

ఉక్కునగరం: సీఐఎస్ఎఫ్ సౌత్ జోన్–2 డీఐజీ అపరాజిత మహాపాత్ర బుధవారం స్టీల్‌ప్లాంట్ ఇన్‌చార్జ్ సీఎండీ అజిత్‌కుమార్ సక్సేనాను కలిశారు. విశాఖ పర్యటనకు వచ్చిన డీఐజీ ఉక్కు పరిపాలన భవనంలో సీఎండి సక్సేనాతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సీఐఎస్ఎఫ్ యూనిట్ సిబ్బంది గురించి చర్చించారు. స్టీల్‌ప్లాంట్ సీఐఎస్ఎఫ్ యూనిట్ నూతన కమాండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన జితేంద్రబాబు దువ్వాడ కూడా మొదటి సారి సీఎండీను మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో సీఐఎస్ఎఫ్ యూనిట్ అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా సంకటహర చతుర్థి

కూర్మన్నపాలెం: సంకటహర చతుర్థిని పురస్కరించుకొని 87వ వార్డులోని కోదండరామాలయంలోని వరసిద్ధి వినాయక స్వామికి బుధవారం ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు బొడ్డగోవింద్, బి.సన్యాసిరావు, సత్తిబాబు, సన్యాసినాయుడు, పూడి శ్రీనివాసరావు, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

జియో సింథటిక్స్‌తో బహుళ ప్రయోజనాలు



సదస్సు ప్రారంభిస్తున్న వీఎంఆర్‌డీఏ చీఫ్ ఇంజినీర్ వినయ్‌కుమార్

విశాఖ విద్య: జియో సింథటిక్స్ బహుళ ప్రయోజనకరంగా నిలుస్తున్నాయని వీఎంఆర్‌డీఏ చీఫ్ ఇంజినీర్ ఎం.వినయ్‌కుమార్ అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో బుధవారం నిర్వహించిన ఒకరోజు సదస్సును ఆయన ప్రారంభించి మాట్లాడారు. మానవ మేధస్సు నుంచి జియో సింథటిక్స్ ఉద్భవించిందని, మూడు శతాబ్దాలుగా దీని ప్రాముఖ్యత పెరుగుతూ వస్తోందన్నారు. విశాఖలో చేపట్టిన తొలి ఫ్లైఓవర్ నిర్మాణంలో కూడా జియో సింథటిక్స్ వినియోగించామని చెప్పారు.

ముగిసిన బ్యాడ్మింటన్ పోటీలు



బహుమతితో మోజెష్



నిర్వాహకులతో విజేతలు

సత్తాచాటిన మోజెష్

కూర్మన్నపాలెం: ఈ నెల 13 నుంచి 3 రోజుల పాటు గ్రీన్ సిటీలో నిర్వహించిన రాష్ట్ర ఓపెన్ ప్రైజ్ మనీ బాడ్మింటన్ పోటీలు బుధవారంతో ముగిశాయి. 87 వ వార్డుకు చెందిన కింతాడ మోజెష్ ప్రథమ బహుమతి గెలుచుకున్నాడు. ఈ మేరకు గ్రీన్ సిటీలో జరిగిన ముగింపు కార్యక్రమంలో 87వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు కోమటి శ్రీనివాసరావు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ వార్డు పరిధిలోని నివాసముంటున్న బాలుడు బాడ్మింటన్ పోటీల్లో రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతి పొందడం గర్వకారణం అన్నారు. కాగా డబ్లుల్స్‌లో విజేతగా కింతాడ మోజెష్, టి. అభినయ్ సత్తా చాటారు. మోజెష్‌కు కోచ్ ఎంపీ మురళీ కృష్ణ శిక్షణ ఇచ్చారు.కార్యక్రమంలో వి. సన్యాసిరావు,వెంకటరావు,పారిపల్లి, గంధం మురళి తదితరులు పాల్గొన్నారు.

మేఘం కమ్మేసింది.. వాన కురిసింది



మబ్బుపట్టిన ఆకాశం

పెదగంట్యాడ: అప్పటి వరకూ భగభగలు... అంతలోనే కమ్మిన కారు మబ్బులు .. ఆపై చిరు జల్లులు.. ఇలా బుధవారం విభిన్న వాతావరణం ఏర్పడింది. మండే ఎండతో అల్లాడిన పెదగంట్యాడ మండల ప్రజలు సాయంత్రం చల్లగాలులతో సేదదీరారు. తర్వాత కొద్దిగా వర్షం పడడంతో వాతావరణం చల్లబడింది. వేసవిలో ఉక్కపోతతో ఇబ్బందులు పడిన ప్రజలకు ఉపశమనం లభించింది..



వెంపల్లినగర్‌లో వర్షంలో నడుస్తున్న మహిళలు

మిస్సింగ్ కేసు ఛేదన



గోపి సునీల్ కుమార్‌ను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న సీఐ పార్థసారథి

అక్కిరెడ్డిపాలెం: గతేడాది నమోదైన మిస్సింగ్ కేసును గాజువాక పోలీసులు ఛేదించారు. ఇంటి నుంచి వెళ్లిపోయిన యువకుడిని బుధవారం ఆయన తల్లిదండ్రులకు అప్పగించారు. గాజువాక సీఐ పార్థసారథి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గాజువాకకు చెందిన గోపి సునీల్ కుమార్ (24) గతేడాది డిసెంబర్ 2న ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీంతో సునీల్ కుమార్ తల్లి భారతి గాజువాక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి నుంచి సీఐ పార్థసారథి నేతృత్వంలో సిబ్బంది ట్రేస్ చేయగా యువకుడు కర్నూలులో ఉన్నట్లు గుర్తించారు. వెంటనే యువకుడిని అక్కడ నుంచి తీసుకు వచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. తమ కుమారుడిని అప్పగించడంతో గాజువాక పోలీసులకు యువకుడి తల్లిదండ్రులు, బంధువులు కృతజ్ఞతలు తెలిపారు.

సోనియా, రాహుల్‌పై కక్షసాధింపు తగదు

గాజువాక: నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీపై ఎన్‌డీఏ ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు దిగడం సబబు కాదని ఆ పార్టీ గాజువాక నాయకుడు జెర్రిపోతుల ముత్యాలు అన్నారు. చినగంట్యాడలో బుధవారం నిర్వహించిన ఆ పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడారు. దేశం కోసం ప్రాణాలు త్యాగం చేసిన గాంధీ కుటుంబాన్ని ఇబ్బంది పెట్టడం దారుణమన్నారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి చర్యలకు తావు ఉండకూడదని, ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం పునరాలోచించుకోవాలని కోరారు. సమావేశంలో నాయకులు ఎరబాల భూలోక, ఎం.ఎస్. వర్మ, అప్పారావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంకటహర చతుర్థి పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు



సంకటమోచన గణపతి

పెదగంట్యాడ: నడుపూరులోని సంకటమోచన గణపతి దేవాలయంలో బుధవారం సంకటహర చతుర్థి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు మంత్రి నరసింహమూర్తి, జయంతి ఆధ్వర్యంలో వేద పండితుల శాస్త్రోక్తంగా పంచామృతాభిషేకాలు, విశేష పూజలు చేశారు. అధిక భక్తులు సంఖ్యలో పాల్గొని సంకటమోచన గణపతిని దర్శించుకున్నారు.

బాల వినాయకునికి..

అక్కిరెడ్డిపాలెం: భెల్ సిగ్నల్ పాయింట్ వద్ద గల వినాయక స్వామి, వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. బుధవారం సంకటహర చతుర్థిని పురస్కరించుకుని బాల వినాయక స్వామికి గరిక పూజ చేశారు. ఆలయ అర్చకులు చరణ్, లక్ష్మీ నారాయణ మూర్తి ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో పరిసర ప్రాంత భక్తులు విశేషంగా పాల్గొన్నారు.



భెల్ వద్ద బాల వినాయకుని ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

అప్రమత్తతతో అగ్నిప్రమాదాలకు చెక్

పెదగంట్యాడ: అప్రమత్తతతో అగ్ని ప్రమాదాలు అరికట్టవచ్చునని అగ్నిమాపక జిల్లా అధికారి ఎస్. గోపీకృష్ణ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పెదగంట్యాడ, గాజువాక పరిసర ప్రాంతాల్లో అగ్ని మాపక దళ సిబ్బందితో కలసి బుధవారం ప్రజలకు అవగాహన కల్పిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అజాగ్రత్త వల్లే అగ్ని ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. అగ్ని ప్రమాదాలు సంభవించినపుడు ఎలా నివారించాలనే అనే అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అలాంటి సమయంలో ఆస్తి నష్టం, ప్రాణనష్టం వాటిల్లకుండా సకాలంలో సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ప్రమాదాలు సంభవించినపుడు మంటలను ఏ విధంగా అదుపుచేస్తారో ప్రయోగాత్మకంగా ప్రదర్శన ద్వారా తెలియజేశారు.



పెదగంట్యాడలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక దళ సిబ్బంది

గెడ్డల అభివృద్ధి పట్టదా?



మింది విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద రోడ్డు పక్కన గెడ్డలో వ్యర్థాలు



భెల్ సిగ్నల్ పాయింట్ వద్ద శిథిలమై కోతకు గురైన గెడ్డ

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68, 69వ వార్డుల్లో గెడ్డలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. వీటిని అభివృద్ధి చేయాలనే ఆలోచన జీవీఎంసీకి లేనట్టుంది. ఒక వైపు స్వచ్ఛ విశాఖ అంటూ ఊదరగొడుతున్న జీవీఎంసీ వీటిపై దృష్టి పెట్టకపోవడం శోచనీయం.

- జీవీఎంసీ 68వ వార్డు రాంనగర్ భెల్ సిగ్నల్ పాయింట్ సర్వీసు రోడ్డును ఆనుకొని గెడ్డ కోతకు గురైంది. పలు వాహనాలు గెడ్డలోకి దూసుకుపోయిన సంఘటనలు ఉన్నాయి.
- రాంనగర్ ఏ – బ్లాక్‌లో చేపల మార్కెట్ గెడ్డను ఆనుకొని ఉంది. ఇటు గాజువాక నుంచి శ్రీలానగర్ వరకు కొనుగోలు దారులు ఈ మార్కెట్‌నే ఆశ్రయిస్తుంటారు. కొనుగోలు దారులు మాత్రం గెడ్డవల్ల అసౌకర్యానికి గురవుతున్నారు.
- మరో చోట గెడ్డలోని మంచినీటి హెడ్ షెడ్‌ను ఏర్పాటు చేశారు. మంచినీటి షెడ్‌లోకి మురుగునీరు పోతుందా, లేదా మంచినీరు బయటకు వచ్చి మురుగు కాలువలోకి పోతుందా అనే విషయం తెలియని పరిస్థితి.
- జీవీఎంసీ 69వ వార్డు మింది విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద మీటర్ల మేర ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయాయి. వేసవి కాలం కావడంతో గెడ్డల్లో మురుగు ఎండపోయి ఉంటున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో పూడికలు తొలగిస్తే ముంపు ముప్పు ఉండదని చెబుతున్నారు.



రాంనగర్ ఏ - బ్లాక్‌లో గెడ్డలో మంచినీటి హెడ్ షెడ్ చుట్టూ మురుగు

